నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

గురువుబోధనలను గుర్తుపెట్టుకొనుచు
జ్ఞప్తిచేసుకొనుడు జ్ఞాపకముల
మరచిపోకు నీవు గురువు నీరోజున
తరలి వెళ్ళి కలువు తప్పకుండ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 158 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 5-9-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00




# ట్రేడ్ టారిఫ్స్ తీరు దారుణం

- కాలం చెల్లిన వలసవాద విధానాలని విమర్శలు
- అమెరికా సుంకాలపై పుతిన్ అసహనం

బీజింగ్,

భారత్, చైనాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అండగా నిలిచారు. అమెరికా విధిస్తున్న సుంకాలను పరోక్షంగా వ్యతిరేకించారు. ఇరు దేశాలపై అమెరికా అవలంబీస్తున్న ట్రేడ్ టారిఫ్స్ ను పుతిన్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి చర్యలు కాలం చెల్లిన వలసవాద మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన అన్నారు. చైనాలో తన నాలుగు రోజుల పర్యటన తర్వాత పుతిన్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు 1.5 బిలియన్ల జనాభా కలిగిన భారతదేశం, శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా వంటి దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు సరికాదని పుతిన్ అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలు.. దీర్ఘకాలంగా ఉన్న ఆయా దేశాల సార్వభౌమాధికారంపై దాడులుగా భావించే అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. వలస రాజ్యాల యుగం ముగిసిందన్న పుతిన్.. భాగస్వాములతో జాగ్రత్తగా

-మిగతా 2 లో



# చెట్లను నరికివేయడమే ఆకస్మిక వరదలు

**చెట్లను విస్తృతంగా నరికివేయడం వల్లే ఇదంతా**

- కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత రాష్ట్రలు సమాధానం ఇవ్వాలి
- పర్యావరణ క్షీణతపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం సుప్రీంకోర్టు విచారణ

**హైదరాబాద్:** ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):

ఉత్తరభారత్ ఆకస్మికంగా సంభవించిన వరదలకు..అక్రమంగా చెట్లను నరికివేయడమే కారణమని సుప్రీంకోర్టు పేర్కొంది.కొండ ప్రాంతాల్లో పర్యావరణ క్షీణతపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తరభారతంలో నమోదవుతున్న వరస విపత్తులపై ఆందోళన వ్యక్తం చేసింది. విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) BR గవాయ్ ఇలా వ్యాఖ్యానించారు. 'ఉత్తరాఖండ్,

-మిగతా 2 లో



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- కామారెడ్డి వరదల్లో అధికారుల కృషి ప్రశంసనీయం
- నష్టానికి సంబంధించి నివేదికలు సిద్ధంచేయాలి
- కేంద్రం నుంచి సాయం అందేలా చూడాలి
- యూరియా కోసం పడిగాపులు పడకుండా చూడండి
- కామారెడ్డిలో అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

**కామారెడ్డి,** ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):

వరదలు, విపత్తుల సమయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఇటీవల కురిసిన వర్షం, వరదలతో కామారెడ్డి జిల్లాకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంటలకు, ఆస్తులకు తీవ్ర నష్టం చేకూరిందన్నారు. గురువారం సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి జిల్లాలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి కామారెడ్డి వణికిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కామారెడ్డి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడంతో పాటు వరద బాధితులను సీఎం రేవంత్ పరామర్శించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి.. పంట, ఆస్తి నష్టం వివరాలు అడిగి

-మిగతా 2 లో




# ఓటరు కార్డులు ఒకటికి మించి ఉంటే నేరం

- అలాంటి వాటిని వెంటనే సరెండర్ చేయాలి
- లేకుంటే చర్యలు తప్పవన్న ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ,

ఓటరు కార్డులకు సంబంధించి ఎన్నికల సంఘానికి ఇటీవల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఒకటికి మించి ఓటరు కార్డులు కలిగి ఉండటం నేరమని ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ రెండు, అంతకన్నా ఎక్కువ ఉన్నట్లయితే ఒకదాన్ని మాత్రమే పెట్టుకొని, అదనపు కార్డులను సరెండర్ చేయాలని స్పష్టం చేసింది. అలా చేయకపోవడం తీవ్రంగా పరిగణిస్తామని అన్నారు. రెండు ఓటరు కార్డులను కలిగి ఉండటం ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950 ప్రకారం నేరం. సెక్షన్ 31 కింద వారికి గరిష్ఠంగా ఏడాది శిక్ష లేదా జరిమానా లేదా రెండూ ఉండొచ్చు. ఒకవేళ ఎవరి వద్దనైనా రెండు, అంతకంటే ఎక్కువ కార్డులు ఉంటే ఒకటి మాత్రమే తమ వద్ద ఉంచుకోవాలని ఈసీ అధికారులు వెల్లడించారు. ఓటరు జాబితాలో రెండు చోట్ల ఓటరుగా ఉన్నట్లయితే.. ఒకచోట తమ పేరును తొలగించాలని కోరుతూ ఫారం-7 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

-మిగతా 2 లో


# గణేశ్ నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

- అమిత్ షా రాకతో భద్రత మరింత కట్టుదిట్టం
- 6న ఉదయమే ఖైరతాబాద్ గణేశుడి తరలింపు

**హైదరాబాద్,** ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):

గణేశ్ మహానిమజ్జనానికి కేంద్రహోంమంత్రి అమిత్ షా రానుండడం తో ఈ యేడు ప్రత్యేకతను సంతరించుకోనుంది. దీనికితోడు పోలీసులు కూడా మరింత అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. తొలుత ఖైరతాబాద్ వినాయకుడిని ఉదయమే ట్రాలీ ఎక్కించి సాగనంపుతారు. శనివారం దర్శనాలకు అనుమతి లేదు. శనివారం జరిగే మహానిమజ్జనం ప్రశాంతంగా, ఇబ్బందులు లేకుండా జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇప్పటికే తెలిపారు. నిమజ్జన శోభాయాత్ర జరిగే మార్గాన్ని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, రాచకొండ కమిషనర్

-మిగతా 2 లో





# వరదలను జాతీయ విపత్తుగా గుర్తించండి

- తక్షనమే సాయం అందించి రాష్ట్రాన్ని ఆదుకోండి
- దాదాపు రూ.5,018 కోట్ల విలువైన నష్టం వాటిల్లింది
- కేంద్రహోంమంత్రి అమిత్ షా,నిర్మలా సీతారామన్‌లకు వినతి
- తక్షణ సాయం అందించాలని కోరిన మంత్రులు భట్టి, తుమ్మల

న్యూఢిల్లీ,

ఇటీవలి వర్షాలు వరదలను జాతీయ విప్తతుగా గుర్తించి తగన సాయాన్ని అందించాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఈ మేరకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నిర్మాలా సీతరామన్‌లను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఇటీవల రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన వర్షాలు, పంట నష్టం గురించి అమిత్ షాకు వీరు వివరించారు. ఆగస్టు 25-28 మధ్య కురిసిన వర్షాలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణ, అత్యవసర మరమ్మతులకు నిధులు

-మిగతా 2 లో

# జీఎస్టీ సంస్కరణలతో దేశ ప్రజలకు దీపావళి గిఫ్ట్

## అందుకే జీఎస్టీ సంస్కరణలకు శ్రీకారం

- తదుపరి తరం సంస్కరణలు అవసరం
- హెయిర్ పిన్స్ కూడా తెప్పించుకోవడం మానాలి
- లక్షకోట్ల వంటనూనెలను దిగుమతి చేసుకుంటున్నాం
- గతంలో చాక్లెట్లపై 21శాతం పన్నులు వేశారు
- ఇవన్నీ తగ్గించుకోగిలిగితేనే స్వావలంబన సాధ్యం
- జాతీయ అవార్డు గ్రహీత టీచర్లతో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలతో దేశ ప్రజలకు దీపావళి గిఫ్ట్ ఇచ్చామన్నారు. దీంతో దీపావళికి ముందే దేశ ప్రజల్లో ఆనందం వెల్లివిరిసిందన్నారు. దీపావళి, చత్ పూజకు ముందే దేశ ప్రజలకు డబుల్ దమాకా ఇస్తామని ఆగస్ట్ 15 సందర్భంగా ఎర్రకోట నుంచి హామీ ఇచ్చాను.. మాట ఇచ్చినట్లుగానే దీపావళికి ముందే ప్రజలకు గిఫ్ట్ ఇచ్చానన్నారు. వస్తు-సేవల పన్ను రేట్లలో సంస్కరణలపై ప్రధాని మోదీ స్పందించారు. దేశాన్ని స్వావలంబన దిశగా మార్చడానికి తదుపరి తరం సంస్కరణలు అవసరమని భావించామని, ఇందుకు అనుగుణంగానే తమ ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. దీపావళి,

-మిగతా2 లో

# నేడు రేషన్ దుకాణాలు బంద్

- రాష్ట్రవ్యాప్త బంద్‌కు డీలర్ల పిలుపు



హైదరాబాద్,

తెలంగాణలో రేషన్ దుకాణాలు మూతపడనున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపిస్తూ రేషన్ డీలర్లు శుక్రవారం రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో రాష్ట్రంలోని అన్ని రేషన్ దుకాణాలు మూత పడనున్నాయి. ఎన్నికలకు ముందు తమకు నెలకు రూ. 5 వేల గౌరవ వేతనం ఇస్తామని, కమీషన్ పెంచుతామని ప్రభుత్వం

-మిగతా 2 లో

# సింగరేణికి ఫైవ్ స్టార్ రేటింగ్




- ముంబైలో కిషన్ రెడ్డి చేతులమీదుగా అవార్డు

**హైదరాబాద్ ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్న కంపెనీగా ఉన్న సింగరేణి గత ఆర్థిక సంవత్సరానికి జాతీయ స్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను కైవసం చేసుకుంది. దీనికి సంబంధించిన కార్యక్రమం గురువారం ముంబయిలో వైభవంగా జరిగింది. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సింగరేణి సీఎండీ బలరామ్ ఫైవ్‌స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్నారు. ప్రతిష్ఠాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు పొందిన గనులలో రామగుండం-3 ఏరియాకి చెందిన ఆర్.జి.ఓ.సి-1

-మిగతా 2 లో

# కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు

- బీఆర్ఎస్‌కు సంపద లాంటి వ్యక్తి హరీష్ రావు..
- నాడు హరీష్ రావు పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారు.
- ఆయనను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణకు నష్టం కాదా..?
- మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి



మెదక్

ఎమ్మెల్సీ కవిత విషయంలో పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేసి కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు అని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు.గత రెండు, మూడు రోజులుగా కవిత మాట్లాడుతున్న మాటలు చూస్తున్నాం. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. కవిత తన తీరుతో పార్టీ కి ఎంతో నష్టం చేశారు. బీఆర్ఎస్‌కు సంపద లాంటి వ్యక్తి హరీష్ రావు.. ఆయనను బలహీనపరిచేలా వ్యాఖ్యలు చేస్తే తెలంగాణకు నష్టం కాదా..? అని ఆమె ప్రశ్నించారు. కార్యకర్తగా, నేతగా, మంత్రిగా, ఎమ్మెల్యేగా అందరికీ అందుబాటులో ఉండి పనులు చేసిన వ్యక్తి హరీష్ రావు. నాడు హరీష్ రావు పనితీరును పొగిడిన వారే నేడు ఆరోపణలు చేస్తున్నారు. వారికి ఎలా మనసు ఒప్పుతుందో అర్థం కావడం లేదు. ఈటెల రాజేందర్ పార్టీ నుండి వెళ్లిపోవడంలో హరీష్ రావు పాత్ర లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల మీద శాసనసభలో హరీష్ రావు కాంగ్రెస్ డొల్లతనాన్ని ఎండగట్టారు. కవిత హరీష్ రావును టార్గెట్ చేసి మాట్లాడడం

-మిగతా 2 లో

## ట్రేడ్ టారిఫ్స్ తీరు దారుణం

(మొదటి తరువాయి)

మాట్లాడాలని ట్రంప్‌కు హితవు పలికారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు ఉన్నప్పటికీ, చివరికి అన్ని విషయాలూ కొలిక్కివస్తాయని పుతిన్ అన్నారు. మళ్లీ ఆయా దేశాల మధ్య సాధారణ పరిస్థితులు చూస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని కేవలం ఒక సాకుగా మాత్రమే చూపి ట్రంప్ ప్రవర్తిస్తున్నారని పుతిన్ చెప్పారు. దీనికి ఉదాహరణగా ఉక్రెయిన్ యుద్ధానికి ప్రత్యక్ష సంబంధం లేని బ్రెజిల్ దేశంపై అమెరికా అదనపు సుంకాలను విధించడాన్నీ ఆయన ఎత్తి చూపారు. ఈసందర్భంగా మోదీతో కారులో జరిగిన సీక్రెట్ సంభాషణ గురించి ఓ విలేకరి ఆయన్ను ప్రశ్నించారు. దీనికి పుతిన్ బదులిస్తూ.. 'అదేం పెద్ద రహస్యం కాదు. అలాస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన చర్చల గురించి మోదీకి వివరించానని పేర్కొన్నారు. కాగా.. ఉక్రెయిన్‌తో యుద్ధం ముగించే అంశంపై ట్రంప్, పుతిన్‌లు ఇటీవల అలాస్కాలో సమావేశమయిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా ఈ ఇద్దరు నేతలు కారులో ప్రయాణించారు. ఆ కారులో అమెరికా అధినేతతో జరిగిన సంభాషణ వివరాలు కూడా ఇప్పుడు పుతిన్ పంచుకున్నారు. ట్రంప్‌తో తన సంభాషణ బ్రోకెన్ ఇంగ్లీష్‌లోనే జరిగిందని తెలిపారు. తాము 30 సెకన్లు మాత్రమే మాట్లాడుకున్నామని.. ట్రంప్ ఆరోగ్యంగా ఉండటం చూసి సంతోషంగా ఉన్నానని అతనితో చెప్పినట్లు- వెల్లడించారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్ తన వాహన కాన్వాయ్‌ను తీసుకొచ్చారు. పది నిమిషాలు నిరీక్షించి మరీ.. మోదీని పుతిన్ తన కారులో తీసుకెళ్లారు. దాదాపు ముప్పావుగంటసేపు ఇరువురి నేతలు ఏకాంతంగా మాట్లాడుకున్నారని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి పేర్కొన్నారు. పుతిన్‌తో కారులో ప్రయాణించిన ఫొటోను మోదీ నాడు ఎక్స్‌లో పంచుకున్నారు. తమ మధ్య చర్చలు ఎప్పుడూ వివేకంతో జరుగుతాయని, ఈసారీ అద్భుతంగా సాగాయని తెలిపారు. అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో వీరి ద్వైపాక్షిక భేటీ- తీవ్ర చర్చనీయాంశమైంది.

## చెట్లను నరికివేయడమే ఆకస్మిక వరదలు

(మొదటి తరువాయి)

హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లలో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలు మనం చూశాం. మీడియాలో వస్తున్న అనేక కథనాలు, వీడియోల్లో వరద నీటి ప్రవాహంతో పాటుగా పెద్ద ఎత్తున్న కలపదుంగలు కొట్టుకొచ్చాయి. ఆ ప్రాంతాల్లో చెట్లను విస్తృతంగా నరికివేయడం వల్లే ఇదంతా జరిగినట్లు కనిపిస్తోందని' అన్నారు. ఈ అంశంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీం కోర్టు దీనిని తీవ్రమైన సమస్యగా అభివర్ణించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు సంబంధిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్, పంజాబ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. అదేవిధంగా, వరద నీటిలో తేలుతున్న చెట్ల దుంగల వీడియోలను పరిశీలించి మూలకారణాలపై నివేదిక అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

## ఒటరు కార్డులు ఒకటికి మించి ఉంటే నేరం

(మొదటి తరువాయి)

ఇందుకోసం ఆన్‌లైన్‌లోనూ వెసులుబాటు- ఉందన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఆ పార్టీ మీడియా-పబ్లిసిటీ- సెల్ ఛైర్మన్ పవన్ ఖేడాకు రెండు ఓటరు కార్డులున్నాయనే ఫిర్యాదు రావడంతో ఎన్నికల సంఘం ఆయనకు ఇటీవల నోటీసు జారీచేసింది. దీనిపై ఖేడా స్పందిస్తూ.. ఎన్నికల అధికారుల తీరును తప్పుపట్టారు. డిలీట్ చేయాలని గతంలోనే దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఈసీ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించలేదన్నారు.

## గణేశ నిమజ్జనానికి భారీగా ఏర్పాట్లు

(మొదటి తరువాయి)

సుధీర్‌బాబు, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌లతో కలిసి బుధవారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు బాలాపూర్ గణనాథుడిని వారు దర్శించుకున్నారు. బాలాపూర్ నుంచి మొదలయ్యే శోభాయాత్ర చార్మినార్ సర్కిల్, మొజంజాహి మార్కెట్, తెలుగు తల్లి వంతెన మీదుగా ప్రధాన నిమజ్జన కేంద్రమైన హుస్సేన్ సాగర్‌కు చేరుకోనుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు చేయాల్సిన ఏర్పాట్లు-, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ మళ్లింపు, భద్రతా చర్యలపై అధికారులు చర్చించారు. నిమజ్జన పర్వం ప్రశాంతంగా జరిగేలా భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు- చేస్తున్నామని సీవీ ఆనంద్ తెలిపారు. 30 వేల మంది పోలీసులు బందోబస్తులో ఉంటారని పేర్కొన్నారు. కాగా, సెప్టెంబరు 2వ తేదీ వరకు గ్రేటర్ పరిధిలో 1,21,905 విగ్రహాల నిమజ్జనం జరిగిందని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జీహెచ్‌ఎంసీ పేర్కొంది. అత్యధికంగా కూకట్‌పల్లి జోన్‌లో 41 వేలకుపైగా, శేరిలింగంపల్లిలో 21 వేలకుపైగా విగ్రహాల నిమజ్జనం జరిగింది. అత్యల్పంగా చార్మినార్‌లో 6,254 విగ్రహాలు గంగ ఒడికి చేరాయి. మహా నిమజ్జనం నేపథ్యంలో రవాణా శాఖ వాహనాలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సిఫారసు మేరకు స్థానిక రవాణా శాఖ కార్యాలయాల్లో నిర్వాహకులకు వాహనాలు సమకూరుస్తారు. నేరుగా ఆర్‌టీఏ అధికారులకు దరఖాస్తు చేసుకున్నా అందుబాటులో ఉన్న వాహనాలను పంపుతామని ఓ అధికారి తెలిపారు. ఇప్పటి వరకు 1500లకుపైగా అభ్యర్థనలు వచ్చాయని తెలిపారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో బుధవారం రాత్రి ప్రభుత్వ శాఖల అధికారులతో సీపీలు సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం సామూహిక వినాయక నిమజ్జనోత్సవానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రానున్నారని తెలిపారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ గతేడాది 13,250 విగ్రహాల నిమజ్జనం జరగగా ఈ సంవత్సరం ఇప్పటికే 11,700 జరిగాయని తెలిపారు. సామూహిక వినాయక నిమజ్జనోత్సవాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సూచించారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

(మొదటి తరువాయి)

తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించడం ద్వారా వరదల వల్ల ఎక్కువ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, స్థానిక యంత్రాంగం సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు. సమస్య వచ్చినప్పుడు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వరదలతో నష్టపోయిన అన్ని నియోజకవర్గాలకు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ రూల్స్ ప్రకారం వరద నష్టం వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. పాఠశాలలు, వైద్యం, ప్రాజెక్టులపై ప్రణాళిక ప్రకారం పని చేయాలని చెప్పారు. యూరియా సరఫరాలో అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వరద నష్టం ఎక్కువగా జరగకుండా అప్రమత్తమై, సరైన సమయంలో స్పందించి చర్యలు చేపట్టిన అధికారులను ఆయన అభినందించారు. పరిపాలనా సౌలభ్యం కోసం వివిధ శాఖలను ఏర్పాటు- చేసుకున్నామని తెలిపారు. క్రైసిస్ మేనేజ్మెంట్ సమయంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు వివిధ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో వ్యవహరించాలని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పకడ్బందీగా అమలు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాబోయే 15 రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇంచార్జ్ మంత్రి సీతక్క ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సమీక్షలో సీతక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రిలీఫ్ ఫండ్‌ను రాబట్టుకోవాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత ప్రణాళికలు రూపొందించడానికి అధికారులు కృషి చేయాలని సీఎం వివరించారు. యూరియా రైతులు ఎక్కువ సేపు లైన్లో నిలబడి అలిసిపోతున్నారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అలిసిపోవడం వల్ల అసలు యూరియా లేదని చెప్తున్నారని పేర్కొన్నారు. యూరియా సరిపడా అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు. అందరూ ఒకే దగ్గర ఉండేసరికి యూరియా కోసం ఉన్న లైన్ పెద్దగా కనిపిస్తుందని స్పష్టం చేశారు. లైన్లో చివర ఉన్న వారికి యూరియా ఇవ్వాలంటే 8 గంటల సమయం పడుతుందని వివరించారు. ఆ 8 గంటలు లైన్లో నిలబడలేక, సహనం కోల్పోయి.. ధర్నాలు చేస్తున్నారని అన్నారు. రైతులను ఎవరో ఒకరు తీసుకెళ్లి కావాలనే రోడ్ల మీద కూర్చో పెడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అలా కాకుండా వారికి టోకెన్లు ఇచ్చి సమయానికి యూరియా సరఫరా చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్‌తో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్, సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# వరదలను జాతీయ విపత్తుగా గుర్తించండి

(మొదటి తరువాయి)

ఇవ్వాలని కోరారు. పంటలు, ప్రజల ఆస్తులు, రహదారులు, చెరువులకు జరిగిన నష్టంపై వివరణ ఇచ్చారు. దాదాపు రూ.5,018 కోట్ల విలువైన నష్టం జరిగిందని, రాష్ట్రానికి విపత్తు నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం మంత్రిని కోరారు. గతేడాది సెప్టెంబర్‌లో వరదల వల్ల రూ.11,713 కోట్ల నష్టం జరిగితే.. రూ.416.80 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. కేంద్రం మరిన్ని విపత్తు నిధులు ఇచ్చి రాష్ట్రాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితులు, రుణాలు తదితర అంశాలపై కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి విన్నవించారు. పామాయిల్‌పై తగ్గించిన సుంకాల వల్ల రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించినట్టు- మంత్రులు తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న విద్యాసంస్థలకు ఆర్థిక సాయం అందించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టం అంచనాలను వివరించనున్నట్టు చెప్పారు. తాజా భారీ వర్షాలు, వరదలతో తెలంగాణ రాష్ట్రం అతలాకుతలం అయిన నేపథ్యంలో రాష్ట్ర డిప్యూటీ- ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర పరిస్థితులను వివరించారు. మధ్యాహ్నం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌తో సమావేశమైన భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, లోన్ రీస్ట్రక్చరింగ్ అంశాలపై చర్చించారు. అంతేకాదు, తెలంగాణలో విస్తారంగా పండించే పామాయిల్‌పై విధిస్తున్న సుంకాలను తగ్గించాలని కోరారు. రాష్ట్రంలోని విద్యాసంస్థలకు అవసరమైన ఆర్థిక సాయం అందించాలన్న విజ్ఞప్తులను కూడా నిర్మల సీతారామన్ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో వరదల వల్ల జరిగిన భారీ నష్టాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లి, కేంద్రం నుంచి సహకారం కోరామని భట్టి తెలిపారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణలో వందేళ్లలో ఎన్నడూ లేని విధంగా వర్షపాతం నమోదైందని, దాంతో రహదారులు, పంటలు, ఆస్తులకు విపరీత నష్టం జరిగిందని పేర్కొన్నారు. మొన్న ముఖ్యమంత్రి ఏరియల్ సర్వే చేశారు. ఇవాళ ప్రత్యక్షంగా పర్యటించారు. ప్రాథమిక నివేదికను హోం మంత్రి అమిత్ షాకు అందజేసామని అన్నారు. త్వరలో పూర్తి నివేదికను కూడా సమర్పిస్తాం అని తెలిపారు. అలాగే, గతంలోనూ వరదల సమయంలో కేంద్ర బృందాలు వచ్చి పర్యటించినప్పటికీ, ప్రత్యేకంగా ఎలాంటి వరద సాయం రాష్ట్రానికి అందలేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు ఇస్తోంది. అదే విధంగా తెలంగాణకు కూడా ప్రత్యేక గ్రాంట్ కేటాయించాలి. వరదల కారణంగా ఇప్పటివరకు జరిగిన నష్టం సుమారు రూ.5 వేల కోట్లు-. ఈ ప్రాథమిక నివేదికను హోం మంత్రి అమిత్ షా కి అందజేసామని తుమ్మల స్పష్టం చేశారు. రాష్ట్ర మంత్రుల ఈ ఢిల్లీ పర్యటనపై అన్ని వర్గాల దృష్టి సారించింది. వరద నష్టంపై కేంద్రం స్పందించి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్న ఆసక్తి నెలకొంది.

## జీఎస్టీ సంస్కరణలతో దేశ ప్రజలకు దీపావళి గిఫ్ట్

(మొదటి తరువాయి)

ఛత్‌పూజకు ముందే ప్రజలకు రెట్టింపు ఆనందం ఉంటుందని హామీ ఇచ్చామని.. చెప్పినట్లుగానే ప్రజలకు సంతోషకరమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. జాతీయ అవార్డులు పొందిన టీచర్లను ఉద్దేశించి మాట్లాడిన మోదీ పన్నులపై కాంగ్రెస్ అనుసరించిన తీరుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చిన్నారుల చాక్లెట్ల నుంచి ప్రతి వస్తువుపైనా భారీగా పన్ను వసూలు చేసిందన్నారు. ప్రజలకు అనుకూలంగా వెళ్లడమే మా ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశాన్ని స్వావలంబన దిశగా మార్చడానికి తదుపరి తరం సంస్కరణలు అవసరమని భావించానని.. అందుకే జీఎస్టీ పన్ను విధానంలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కొత్త సంస్కరణల వల్ల ఆత్మనిర్భర భారత్ లక్ష్యం మరింత ముందే సాకారం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. జీఎస్టీ శ్లాబుల సవరణలతో అందరికీ ప్రయోజనం ఉంటుందని.. సమయాన్ని బట్టి సంస్కరణలు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. భారతదేశ స్వాతంత్య్రం తర్వాత జీఎస్టీ సంస్కరణలు అతిపెద్ద నిర్ణయంగా అభివర్ణించారు. సంస్కరణలతో జీఎస్టీ పన్ను విధానం మరింత సులభతరంగా, పారదర్శకంగా మారింద న్నారు. జీఎస్టీ సంస్కరణలు దేశానికి మద్దతు, వృద్ధికి డబుల్ డోస్ అని అభివర్ణించారు. జీఎస్టీ సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థకు సరళమైన పన్ను వ్యవస్థ, జీవన నాణ్యతను మెరుగుపరచడం, వినియోగం మరియు వృద్ధిని పెంచడం, వ్యాపార సౌలభ్యత, సహకార సమాఖ్యవాదం అనే ఐదు రత్నాలను జోడించాయని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సరైన సమయంలో మార్పులు అవసరమని.. అలా అయితేనే ప్రపంచంలో మన దేశాన్ని సరైన స్థానంలో నిలబెట్టొచ్చన్నారు. సెప్టెంబర్ 22న అంటే నవరాత్రి మొదటి రోజున జీఎస్టీ తదుపరి తరం సంస్కరణలు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. కాగా, జీఎస్‌టీ-లో భారీ సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇప్పటివరకూ 5, 12, 18, 28 శాతాల్లో నాలుగు రకాలుగా ఉన్న జీఎస్టీ ట్యాక్స్ స్లాబ్‌లను ఇకపై 5 శాతం, 18 శాతం స్లాబ్‌లకే పరిమితం చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ హయాంలో భారీగా పన్నులు వేశారు. చిన్నారుల చాక్లెట్లపైనా 21శాతం పన్ను వసూలు చేశారు. నేనే ఆ పని చేసివుంటే.. నాపై తీవ్ర విమర్శలు చేసేవారు. మా ప్రభుత్వ విధానం మాత్రం ప్రజలకు అనుకూలంగా వెళ్లడమే. నవరాత్రి తొలి రోజు నుంచే జీఎస్టీ కొత్త రేట్లు- అమల్లోకి రానున్నాయి. ఈ సంస్కరణల ద్వారా ఆర్థిక వ్యవస్థకు కొత్తగా పంచరత్నాలను జోడించాం. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో పేదలు, మధ్యతరగతి, మహిళలు, విద్యార్థులు, రైతులు, యువత.. ప్రతిఒక్కరికీ ప్రయోజనం ఉంటుంది. వీటివల్ల మరింత ముందుగానే ఆత్మనిర్భర భారత్ సాకారమవుతుంది. హెయిర్‌క్లిప్‌లు కూడా విదేశాల నుంచి తెచ్చుకునే విధానం మారాలి. ప్రస్తుతం రూ.లక్ష కోట్ల విలువైన వంటనూనె దిగుమతి చేసుకుంటున్నాం. ఇంత మొత్తం బయటకు వెళ్లకుండా ఆపగలిగితే ఎన్నో పాఠశాలలు నిర్మించుకోవచ్చు. చంద్రయాన్ విజయంతో శాస్త్రవేత్తలు కావాలనే కాంక్ష మన విద్యార్థుల్లో పెరిగింది. నూతన ఆవిష్కరణలకు సమయం ఆసన్నమైంది. టీచర్లు విద్యాబుద్ధులు నేర్పడమే కాదు.. యువతరానికి దారి చూపాలి. చిన్నారుల్లో డిజిటల్ దుష్ప్రభావాన్ని కూడా తగ్గించే బాధ్యత మనపై ఉంది. గ్యాంబ్లింగ్ విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. గాంధీజీ నినాదం స్వదేశీ.. దాన్ని అందరం అమలు చేద్దాం. దేశీయ ఉత్పత్తుల వినియోగంతో దేశ రూపురేఖలు మారిపోతాయి. మేడిన్ ఇండియాపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలి. మనదేశంలో తయారైన వస్తువులనే వాడాలి.

## నేడు రేషన్ దుకాణాలు బంద్

(మొదటి తరువాయి)

హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి 21 నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోవడం లేదని తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆరోపించింది. వీటితో పాటు- డీలర్ల కుటుంబాలకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, దుకాణాల అద్దె, బియ్యం దిగుమతి ఛార్జీలను కూడా ప్రభుత్వమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. గత ఐదు నెలలుగా కమీషన్ బకాయిలతో పాటు గన్నీ బ్యాగుల బిల్లులను కూడా ప్రభుత్వం చెల్లించక పోవడంపై డీలర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యల పట్ల ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు విమర్శించారు. తాము ప్రకటించిన ఒకరోజు బంద్‌తోనైనా ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను ఉధృతం చేస్తామని డీలర్లు హెచ్చరించారు. తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే, రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా బియ్యం పంపిణీ నిలిపివేస్తామని స్పష్టం చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే త్వరలోనే సచివాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరికలు జారీ చేశారు.

## కవిత తనకు తానే గొయ్యి తవ్వుకున్నారు

(మొదటి తరువాయి)

విడ్డూరంగా ఉందని పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. పేగు బంధం కన్నా తనను నమ్ముకున్న కోట్లాది ప్రజలే, పార్టీ శ్రేణులు ముఖ్యమని కేసీఆర్ నిరూపించారు. పార్టీ తర్వాతే ఎవరైనా అని కేసీఆర్ సందేశం ఇచ్చారు. పార్టీ నుండి సస్పెండ్ అయినా కవిత మాటలు అర్థ రహితం.. తీవ్రంగా ఖండిస్తున్నాం. కవిత వ్యాఖ్యలను తన విజ్ఞతకు వదిలేస్తున్నాం. ఇంకోసారి హరీష్ రావు గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు. సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో కవిత పని చేస్తున్నారు. పార్టీ ఉంటె ఎంత పోతే ఎంత అని కవిత మాట్లాడొచ్చా..? కవితనే కేసీఆర్‌కు మచ్చ తెచ్చిందని ప్రజలు భావించారు. కేసీఆర్ తీసుకున్న నిర్ణయం గొప్పది అని పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## సింగరేణికి ఫైవ్ స్టార్ రేటింగ్

(మొదటి తరువాయి)




ఎక్స్ -టె-న్షన్, ఇల్లెందు ఏరియాకి చెందిన జె కే-5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్కే-6 గని, ఆర్కే న్యూ-టె-క్ గనులు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా నాలుగు గనులకు 5 స్టార్ రేటింగ్ లభించడంపై సీఎండీ బలరామ్ హర్షం వ్యక్తం చేశారు.

## 2025 సెప్టెంబర్ 5, శుక్రవారం




**మాసం - పక్షం**
భాద్రపద మాసం, శుక్లపక్షం
**తిథి**
శుక్ల త్రయోదశి ఉదయం 4:08 నుండి రేపు
(6వ తేదీ) ఉదయం 3:13 వరకు
తర్వాత శుక్ల చతుర్దశి ప్రారంభం
**నక్షత్రం**
శ్రవణం నిన్న (4వ తేదీ) రాత్రి 11:43 నుండి
ఈ రోజు రాత్రి 11:38 వరకు
తర్వాత ధనిష్ఠ ప్రారంభం రాత్రి 11:38 నుండి
**శుభ సమయాలు**
బ్రహ్మ ముహూర్తం ఉదయం 4:30 - 5:18
అభిజిత్ ముహూర్తం మధ్యాహ్నం 11:50- 12:39
అమృతకాలం మధ్యాహ్నం 1:16 - 2:52
**అశుభ సమయాలు**
రాహుకాలం ఉదయం 10:42- 12:14
యమగండం సాయంత్రం 3:18 - 4:50
గులికా ఉదయం 7:38 - 9:10
దుర్ముహూర్తం ఉదయం 8:33 - 9:22, మధ్యాహ్నం 12:39 - 1:28
వర్జ్యం రాత్రి 3:31 - 5:04

# గ్రానైట్ వ్యాపారులపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానకొండూర్ చెరువు వద్ద గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, గ్రానైట్ వ్యాపారులపై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. “ఇంకెన్నాళ్లు బీఆర్ఎస్‌కు దోచిపెడతారు? మీ వ్యాపారాలకు రాజకీయాలను వాడుకుంటారు. రాజకీయ నాయకులయ్యాక మాలాంటి వాళ్లను ఓడించాలని చూస్తారు” అంటూ అసోసియేషన్ నేతలను నిలదీశారు. ఒక్కో కటింగ్ మిషన్ షాపు నుంచి సభ్యత్వం పేరుతో రూ.10 నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని, ఆ సొమ్ము ఏమయ్యిందని ప్రశ్నించారు. “వసూలు చేసిన పైసల లెక్కలన్నీ త్వరలోనే తీస్తా. సమాజానికి పనికొచ్చే సేవ చేయండి. నాపై నిందలేసినా ఖండించలేదు. చైనాతో సంబంధాలు మెరుగుపర్చినా మోదీకి థ్యాంక్స్ చెప్పలేదు. భయపడుతూ ఎన్నాళ్లు వ్యాపారం చేస్తారు?” అంటూ సంజయ్ ఘాటుగా స్పందించారు . గ్రానైట్ వ్యాపారులు ప్రధాని మోదీ చైనా పర్యటనతో తమ వ్యాపార సంబంధాలు మెరుగవుతున్నాయని చెప్పగా, “మరి కనీసం ప్రెస్ మీట్ పెట్టి థ్యాంక్స్ అయినా చెప్పారు?” అని ప్రశ్నించారు. “మీ అసోసియేషన్ నుంచి నేను ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. కానీ బయట మాత్రం నాపై 700 కోట్ల లంచం తీసుకున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారు. మీరు ఖండించలేదు” అని ఆవేదన వ్యక్తం చేశారు. చింతకుంట చెరువులో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సమయంలో కూడా గ్రానైట్ వ్యాపారులపై విమర్శలు కొనసాగించారు. “గ్రానైట్ అసోసియేషన్ కేంద్రానికి రూ.300 కోట్లకు మించి చెల్లించలేదు. కానీ వెయ్యి కోట్లు ఇచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. గణేష్ మండపాలకు కనీసం మట్టి పోశారా? కరెంట్ బిల్లులు కట్టారా? అధికారులు, పోలీసులు రాత్రింబవళ్లు సేవ చేస్తుంటే వారికి భోజనం, నీరు కల్పించారా?” అంటూ నిలదీశారు. ఖంగుతిన్న గ్రానైట్ అసోసియేషన్ నేతలు సమాజానికి సేవ చేస్తామని, గణేష్ నిమజ్జన సందర్భంగా క్రేన్లు ఏర్పాటు చేశామని, త్వరలోనే మోదీకి థ్యాంక్స్ చెబుతామని తెలిపారు. చివరగా బండి సంజయ్, “ఎవ్వరికీ పైసలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసే పరిస్థితిని కల్పిస్తా” అని హామీ ఇచ్చారు.

# చాగలమర్రిలో భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి గంధం మహోత్సవం.




**చాగలమర్రి , సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామంలో ఘనంగా మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా గంధం మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.గంధం పురవీదుల గుండా తీసుకొని వచ్చి దేవునికి ఫాతెహాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆశారె షరీఫ్ ముతవల్లి ఖాజి అహమద్ గౌస్ , ఖాజీ మహమ్మద్ ఖాజాపీర్ , ఖాజీ సీరాజుద్ధిన్ , ఖాజీ మహమ్మద్ గౌస్, ఖాజీ మహమ్మద్ హుస్సేన్ , ఖాజీ మహమ్మద్ ఫయాజ్ , ఖాజీ మహమ్మద్ హేతరిన్ , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన ఫ్రెషర్స్ డే వేడుకలు







**నల్లగొండ ,ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తిప్పర్తి మండలం కేంద్రంలోని మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఘనంగా ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ ఏ అపర్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఏ లక్ష్యంతో అయితే కళాశాలలో చేరి విద్యని అర్జి స్తున్నారో ఆ లక్ష్య సాధనపూర్తి కోసం ప్రతిక్షణం కష్టపడి చదవాలని ప్రతిక్షణం చాలా విలువైనదని మనల్ని మనం మీరు నిరుత్సాహ పరుచుకోకుండా మనలోని శక్తుల్ని మనం గుర్తించి మనకు శక్తినిచ్చే దారుణం ఎంచుకోవడమే ముఖ్యమని మనం నిత్యం చేసే పనుల వలన ఏ పని మీద అయితే కాలేజీకి వస్తున్నామో అది చేయడం చాలా ముఖ్యమని ఆ జ్ఞానంపై మాత్రమే దృష్టి కేంద్రీకరించడం వలన మీరు మంచి లక్ష్యాలు సాధించవచ్చు అని ప్రతిరోజు సాధన తప్పనిసరి అని నేర్చుకున్నటువంటి విషయాలను స్మరిస్తూ ఉండాలని తెలిపారు విద్యార్థుల ద్వారా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు డాన్సులు, నాటికలు ఎంతగానో అలరించాయని తెలిపారు వీటి ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న కలలు బయటికి వస్తాయని ప్రతి ఒక్కరిలో ఒక కల ఉంటుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు గత సంవత్సరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు తెలుగు అధ్యాపకుడు ఎం రమేష్ 20 మంది విద్యార్థులకు నగదు పురస్కారంతో సత్కరించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# గణనాథునికి 58 రకాల మహా నైవేద్యాలు





**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలోని రాంనగర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం శిరిడి సాయిబాబా ఆలయంలో నెలకొల్పిన వినాయకునికి ఘనంగా మహా నైవేద్యాలు సమర్పించారు. పిండి వంటలతో తయారైన 58 రకాల నైవేద్యాలను వినాయకునికి చూపించి ఆరగింపు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దుగ్యాల సంతోష్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రాంనగర్ యూత్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రానికి శంకుస్థాపన



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ సమీపంలోని అవంతిపురంలో 60 లక్షల వ్యయంతో 2 ఎకరాల్లో నిర్మించనున్న ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శంకుస్థాపన చేశారు. వీధి కుక్కల జనాభా నియంత్రణ, స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ వంటి సేవల కోసం ఈ కేంద్రం ఏర్పాటు చేయబడుతోంది. “హైదరాబాద్ మాదిరిగా మిర్యాలగూడలోనూ ఎబిసి సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. కుక్కల జనాభా నియంత్రణతో పాటు, అన్ని జంతువుల సంక్షేమం కోసం ఇది ఉపయోగపడుతుంది” అని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, పశుసంవర్ధక అధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో ప్రత్యేక ప్రదర్శనగా రజాకార్ సినిమా

-తెలంగాణ గవర్నర్ బిష్ణు దేవ్ వర్మ ఆహ్వానం
-ఆహ్వానించిన తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ సి అంజిరెడ్డి, కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి




**హైదరాబాద్ సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ గవర్నర్ శ్రీ బిష్ణు దేవ్ వర్మ ను తెలంగాణ విమోచన కమిటీ సభ్యులు, విమోచన కమిటీ చైర్మన్ శ్రీ సి. అంజి రెడ్డి, ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో కలుసుకున్నారు. వారితో పాటు కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, గూడూరు నారాయణ్ రెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి,పి. విక్రం రెడ్డి, నందకం దివాకర్, పాతూరి కరుణా పాల్గొన్నారు. సభ్యులు గవర్నర్ గారికి 17 సెప్టెంబర్ తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా, నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్ర ఆధారంగా రూపొందిన “రజాకార్” సినిమాను సెప్టెంబర్ 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో ప్రత్యేక ప్రదర్శనగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామని విమోచన కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు.

# జడ్.పి.హెచ్.ఎస్ దండుమైలారం పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**దండుమైలారం, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సెప్టెంబర్ 5న జడ్.పి.హెచ్.ఎస్ దండుమైలారం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఏఏపీసీ చైర్మన్ శోభ, విద్యార్థుల సమక్షంలో శ్రీనివాస్, శ్రీదేవి, వెంకటేష్, నివేదిత, సులోచన, రామకృష్ణ, లింగామయ్య, సుజాత, రమేశ్, వెంకట రమణ, పుణ్యవతి, సుమలత, అనిత, రామేశ్వరి, విజయ, సురేష్ బాబు లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఏసీబీకి పట్టుబడ్డ నల్గొండ మత్స్యశాఖ అధికారిణి



**నల్లగొండ ,ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
లంచం తీసుకుంటూ జిల్లా మత్స్య శాఖ అధికారిణి చరితా రెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ పారిశ్రామికవేత్త నుంచి రూ.20 వేలు లంచంగా డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.

# నల్లగొండ మున్సిపాలిటీలో కుక్కల ముప్పు నివారణ, నియంత్రణపై అవగాహన కార్యక్రమం



**నల్లగొండ, ఆగస్టు 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండలో వీధి కుక్కల సంఖ్య నానాటికి భారీగా పెరుగుతున్న దృష్ట్యా గురువారం నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ హైస్కూల్, బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు వీధి కుక్కల పెరుగుదల నియంత్రణ చర్యలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి విద్యార్థులకు ఎనిమల్ బర్త్ కంట్రోల్ (ABC) అవగాహన కల్పించారు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో భవిష్యత్తులో మరిన్ని పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపిన మున్సిపాలిటీ అధికారులు తెలిపారు.. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ రవీందర్ రెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు జరుపుకోవాలి

-: ఎమ్మెల్యే విజయ రమణారావు



**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు గురువారం ఎలిగేడు మండల కేంద్రం, శివపల్లి గ్రామంలోని వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. “విగ్నేశ్వరుడి ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్, వైద్య, పోలీస్ శాఖలు అప్రమత్తంగా ఉండాలి” అని సూచించారు.నిమజ్జనం సమయంలో చెరువుల వద్ద భద్రతా ఏర్పాట్లు ఉండాలని, ఉత్సవ కమిటీలు శాంతియుతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అనంతరం హనుమాన్ ఆలయంలో తీర్థప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు దుగ్యాల సంతోష్ రావు, సామ రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు గంగమ్మ ఒడిలోకి గణనాథుడు



**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని 12 గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణేశ నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం నిమజ్జనంతో ముగియనున్నాయి. వాడ వాడలా మండపాలు ఏర్పాటు చేసి, పూజలు, భజనలు, అన్నదానాలతో గణనాథుని ఆరాధించిన నిర్వాహకులు నేడు నిమజ్జనానికి ఘనంగా ఏర్పాట్లు చేశారు.

## రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా కోడూరి శ్రీ వాణి ఎంపిక



**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు గ్రామానికి గర్వకారణంగా, శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కోడూరి శ్రీ వాణి 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసింది. సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శిల్పకళా వేదికలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోనున్నారు. బీడీ కార్మికురాలైన తల్లి సహాయంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే విద్యాభ్యాసం కొనసాగించిన శ్రీ వాణి, బంగారు పతకాలు, ర్యాంకులతో విద్యారంగంలో అద్భుతంగా రాణించారు. పీహెచ్డీ పూర్తి చేసి, ఆరు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై ప్రస్తుతం శాతవాహన విశ్వవిద్యాలయంలో సీనియర్ సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తున్నారు.ఈ ఘనతకు రాష్ట్ర ప్రభుత్వానికి, విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపకులపతి ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ జాస్తి రవికుమార్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎలిగేడు గ్రామ ప్రజలు ఆమెను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గురుపూజోత్సవంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**డిండి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
డిండి మండలంలోని ఆల్ప మోడల్ పాఠశాలలో గురుపూజోత్సవం సందర్భంగా తెడ్లపల్లి అస్మిత్ వెంకట్రావు తల్లిదండ్రులు సంపత్ రావు-స్వర్ణ దంపతులు ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భారతి మాట్లాడుతూ“ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనది. ప్రాథమిక విద్య ఇంటికి పునాది లాంటిది” అని పేర్కొన్నారు. విద్యార్థులు ఇష్టంగా చదవాలని, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సన్మానించిన దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, సినీ, లింగమయ్య, భార్గవి, కీర్తి, మహాజున్, పూజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

– చింతల రవికుమార్ గుప్త



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
వనస్థలిపురం డివిజన్ పరిధి లోని వినాయక చవితి సందర్భంగా పలు మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్త. గుంటి జంగయ్య నగర్ కాలనీ లో నెలకొల్పిన వివిధ వినాయక మంటపలు , జడ్జెస్ కాలనీ, మన్సూరాబాద్ డివిజన్ , భూలక్ష్మి నగర్ , ఏ టైపు కాలనీ, పొచమ్మ టెంపుల్ ముందు వరసలో జరిగిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు బి.ఆర్. ఎస్ పాల్గొన్నారు.

## తెలంగాణ పల్లెలు దేశానికి ఆదర్శంగా మారాలి

-ఎమ్మెల్యే బాలు నాయక్



**చందంపేట, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పోగిళ్ళ గ్రామంలో 3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ శంకుస్థాపన చేశారు. “రైతులకు నిరంతర విద్యుత్ అందించేందుకు ఇది కీలకం. పల్లె అభివృద్ధే దేశ అభివృద్ధికి బాట” అని ఆయన పేర్కొన్నారు. ఈ ఉపకేంద్రం పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలకు నిరవధిక విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని, పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఇది మౌలిక సదుపాయంగా నిలుస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పోగిళ్ళ, పాత కంబాలపల్లి, ఉస్మాన్ కుంట, బొల్లారం గ్రామాల్లో 3.67 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కంబాలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బర్మా వెంకటేశ్వర స్వామి దర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**నేరేడుగొమ్ము, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
నేరేడుగొమ్ము మండలంలోని కాచరాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో కొండపై కొలువైన శ్రీ బర్మా వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గురువారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దేవరకొండ ప్రజలపై ఆయురారోగ్యాలు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల నాయకులు, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## పాల్వాయి గ్రామంలో పాడుకేసిన పారిశుద్ధ్యం

**/గుర్రంపోడు మండలం/ సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పాల్వాయి గ్రామంలో గత కొంతకాలంగా పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో మురుగు నీరు నిల్వలు, చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసనలు వ్యాపిస్తూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మరింత సమస్యలు పెరిగిపోవడంతో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామంలో శుభ్రత, పారిశుద్ధ్యాన్ని కాపాడే విధంగా తగిన చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. గ్రామ ప్రజలు వెంటనే సర్కిల్ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వినాయక నిమజ్జన వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు



**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల పరిధిలో వినాయక నిమజ్జన వేడుకలు శాంతియుతంగా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ సమావేశంలో DLPO వేణుగోపాలరావు, ఎస్ఐ ఎల్. మధుకర్ మాట్లాడుతూ“నిమజ్జన ప్రాంతాల్లో లైటింగ్, గజ ఈతగాళ్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలి. రాత్రి 10 గంటల లోపు నిమజ్జనం పూర్తిచేయాలి” అని సూచించారు.నిమజ్జన స్థలాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో తహసిల్దార్ యాకన్న, ఎంపీడీవో భాస్కరరావు, పంచాయతీ అధికారి కిరణ్, మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టినా, విద్యుత్ శాఖ సిబ్బంది, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## అందుల పాఠశాలలో ఘనంగా ముందస్తు టీచర్స్ డే వేడుకలు



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ అందుల పాఠశాలలో డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, విద్య ద్వారా సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. భరోసా అధ్యక్షులు అగినపల్లి నాగరాజు మాట్లాడుతూ“విద్యాదానం అన్నదానానికి మించినది. సరస్వతి ఉంటేనే లక్ష్మి వస్తుంది” అని అన్నారు. అనంతరం అందుల, బధిరుల పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్, కమల, ఉపాధ్యాయులు రమేష్, రాకేష్, సరళ, శివ జ్యోతి, భరోసా సభ్యులు నాగరాజు, అనూప్, సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో శాంతి భద్రతల కోసం 10 లక్షల రూపాయల విలువ చేసే సీసీ కెమెరాల విరాళం






**మిర్యాలగూడ, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మిర్యాలగూడ పట్టణంలోని 2-టౌన్ పోలీస్ స్టేషన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు వ్యాపారవేత్తలు ముందుకొచ్చారు. శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఎస్పీ రాజశేఖర్ రాజు ఆధ్వర్యంలో 10 లక్షల చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ “పట్టణంలోని ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేస్తాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం” అని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు, పోలీస్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజ చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు

మాలిస్ శివ కుమార్ రెడ్డి



**దోమ మండలం**
**సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
దోమ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రోసినిండ్ ను లబ్ధి దారునికి అందజేసి భూమి పూజ చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాలిస్ శివకుమార్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుద్యాల మల్లేష్, కొండని రాజు, గోద గోపాల్, కారోబార్ తిరుపతి పాల్గొన్నారు.

# కుబ్యతాండ గ్రామపంచాయతీలో వార్డుల పెంపు కోసం వినతి



**మాడుగుల, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మాడుగుల మండలంలోని కుబ్యతాండ గ్రామపంచాయతీ పరిధిలో 1625 మంది ఓటర్లు ఉన్న నేపథ్యంలో, ప్రస్తుతం ఉన్న 8 వార్డుల్లో ప్రతి వార్డుకు సుమారు 200 ఓటర్లు ఉండటంతో, వార్డుల సంఖ్యను 10కి పెంచాలని ఎంపీడీవో వెజ్జన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ వినతిలో బావోజి తండా, మన్య తండా, చిన్న తండా వంటి ప్రాంతాల జనసాంద్రతను దృష్టిలో ఉంచుకుని సముచిత ప్రతినిధిత్వం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేనావత్ విష్ణు, నేనావత్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరతపై బీఆర్ఎస్ ఆందోళన



**ఆమనగల్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్ పట్టణంలో యూరియా కొరతను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పత్య నాయక్ మాట్లాడుతూ“ఎన్నికల ముందు రైతులకు హామీలు ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు వారిపై పగ పెంచుకుంటోంది. కేంద్రంతో మాట్లాడి యూరియా సరఫరా చేయాల్సిన బాధ్యత జాతీయ నాయకులదే. పగలు, పట్టింపులు విడిచిపెట్టి రైతులకు న్యాయం చేయాలి” అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సరిత, పంతు నాయక్, సాయిలు, ఏనుముల రమేష్, వరికుప్పల గణేష్, నాగిళ్ళ జగన్, శ్రీకాంత్ నాయక్, ఉమ్లా నాయక్, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే టిడబ్ల్యూజే లక్ష్యం: ఎం. సైదులు




**ఆమనగల్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
లురంగారెడ్డి జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజే ఎఫ్) ప్రధాన లక్ష్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సైదులు స్పష్టం చేశారు. బుధవారం ఆమనగల్ మండల కేంద్రంలోని శ్రీ వెంకట నరసింహ ఫంక్షన్ హాల్‌లో బ్లాక్ అధ్యక్షుడు దరువుల శంకర్ అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జిల్లా మహాసభ ఆహ్వాన కమిటీ చైర్మన్ సిల్వర్ సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ, “గత సంఘాలకు భిన్నంగా, టిడబ్ల్యూజే ఎఫ్ జర్నలిస్టుల హక్కుల కోసం సమగ్రంగా పని చేస్తోంది. జిల్లాలోని ప్రతి జర్నలిస్టు సమస్య పరిష్కారమే మా లక్ష్యం” అని పేర్కొన్నారు. ఈ నెల 26న కందుకూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిల్వర్ సురేష్ పిలుపునిచ్చారు. “ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, ప్రైవేట్ పాఠశాలల్లో 50% రాయితీ వంటి అంశాలపై తీర్మానాలు తీసుకోబోతున్నాం. అందరూ పాల్గొని సభను జయప్రదం చేయాలి” అని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆమనగల్ బ్లాక్ స్థాయిలో సమన్వయ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.డి. యున్యూస్, సభ్యులుగా డి. శంకర్, నరసింహ, చంద్రశేఖర్, చాట్ల యాదగిరి, తిరుపతి, చంద్రకుమార్, మహేష్ లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

# ఉపాధ్యాయులే దేశ భవిష్యత్తు శిల్పులు

**-పాఠశాల ఉపాధ్యాయులే నిజమైన గురువులు**
**-మన మార్గదర్శకుడు సర్వేపల్లి**
**- ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి**




**వనపర్తి,సెప్టెంబర్ 4 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, తపస్విని కిడ్స్ ప్లే స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణారెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నారులు పాఠశాలలో నిర్వహించిన రాధాకృష్ణ పూజ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, “ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు బోధించే వ్యక్తి మాత్రమే కాదు, విద్యార్థుల జీవితాలకు మార్గదర్శి, సమాజానికి దీపస్తంభం” అని పేర్కొన్నారు. స్కూల్ ఉపాధ్యాయులే నిజమైన గురువులని ఆయన స్పష్టం చేశారు. ఉపాధ్యాయుడు -విద్యార్థి మధ్య ఉండే అనుబంధం సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని రామకృష్ణారెడ్డి తెలిపారు. నాటి ఉపాధ్యాయులు గాని నేటి ఉపాధ్యాయులు గాని, వారి బాధ్యత, విలువ ఎప్పటికీ తగ్గదని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విశిష్టతను గుర్తుచేసుకుంటూ, ఆయన విద్యావేత్తగా, తాత్వికుడిగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు అపూర్వమని రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజు పాఠశాలకు సాధారణ సెలవు దినం కావడంతో ముందుగానే తపస్విని పాఠశాల చిన్నారులు తమ గురువులకు గురువు పూజ నిర్వహించి జ్ఞాపికలను అందజేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలని సందర్శించిన డిసిపి సునీత రెడ్డి



**యాచారం సెప్టెంబర్ 04 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో సాగుతున్నాయి. భక్తులు భక్తి పారవశ్యంతో గణనాధుని పూజిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రులను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి కోరారు. గురువారం హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని బేగర్ కంచ, పిల్లిపలి గ్రామములో గణేష్ నవరాత్రుల ఉత్సహాల్లో భాగంగా మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి , ఇబ్రహింపట్నం ఎసిపి కేవీపీ రాజు, SHO సత్యనారాయణ తో కలిసి వినాయక మండపలను సందర్శించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ... గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.గణేష్ మండపాల వద్ద, శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మసిటీ ఎస్సైలు పోలీస్ సిబ్బంది స్థానిక నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వివాదంపై డిఎల్పిఓ విచారణ



**ఎలిగేడు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న ఇంటి వివాదంపై గురువారం డిఎల్పిఓ వేణుగోపాలరావు రికార్డులతో సహా విచారణ చేపట్టారు. సాదుల పాపయ్య పూర్వీకులు గ్రామపంచాయతీకి రద్దు బదులు చేసిన ఇంటి వివాదంపై వచ్చిన ఫిర్యాదును పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి కిరణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన శోభాయాత్రకు పటిష్ఠ బందోబస్తు

**ఎస్పి శరత్ చంద్ర పవర్**



**నల్లగొండ, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండలో రేపు నిర్వహించబోయే గణేష్ నిమజ్జన శోభాయాత్రకు జిల్లా వ్యాప్తంగా 950మంది పోలీసులను నియమించినట్లు
ఊరేగింపులో డీజేలకు నిషేధం విధించినట్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని శోభాయాత్రలో మసీదులు, దర్గాలు, చర్చీల వద్ద పకడ్బందీ భద్రత ఏర్పాటు చేసినట్లుట్రాఫిక్ అంతరాయం లేకుండా డైవర్షన్లు అమలు - హైదరాబాదు, మిర్యాలగూడ, దేవరకొండ, హాలియ మార్గాల్లో వాహనాల మళ్లింపు జరుగుతున్నట్లు నిమజ్జన ఘాట్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెరువుల్లోకి ఎవ్వరూ దిగనీయరాదని వదంతులు నమ్మొద్దని అసత్య ప్రచారం చేసే వారిపై చర్యలు తప్పవని పోలీసులతో సహకరించాలంటూ గణేష్ మండప నిర్వాహకులకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.


# పదేళ్ల నిరీక్షణకు తెర

**- రేషన్ కార్డు పొందిన కొమ్ము అనిల్**



**తెలకపల్లి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన కొమ్ము అనిల్ కుమార్‌కు పదేళ్ల తర్వాత రేషన్ కార్డు మంజూరైంది. బీఆర్ఎస్ హయాంలో రేషన్ లేక బియ్యం పొందలేక ఇబ్బంది పడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్త కార్డు పొందడంతో మొదటిసారిగా రేషన్ తీసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

# స్టార్ యూత్ ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు



**తెలకపల్లి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలకపల్లి మండలంలోని రాకొండ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టార్ యూత్ ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు గుంపలి పర్వతాల ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణతో పాటు భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారుల నృత్యాలు ప్రజలను మంత్రముగ్ధులను చేయగా, వారిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇడమొని మల్లయ్య యాదవ్, ఇడమొని కాశన్న, ఇటిక్యాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. యువతను ప్రోత్సహిస్తున్న స్టార్ యూత్ సభ్యులను గ్రామ ప్రజలు ప్రశంసలతో సత్కరించారు.

# కొడవటంచ ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష

**రేగొండ, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు సూచించారు. గర్భగుడి, విమాన గోపురం, అన్నదాన సత్రం, క్యూలైన్లు, అర్థమండపం తదితర పనులపై సమీక్ష నిర్వహించారు. రూ.12.15 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని, పునఃప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డిని



ఆహ్వానిస్తానని తెలిపారు

**ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు**
ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిందని ఎమ్మెల్యే గండ్ర పేర్కొన్నారు. లబ్ధిదారుల ఇళ్లలో ఆతిథ్యం స్వీకరించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. యూరియా కొరతపై కేంద్రాన్ని విమర్శించారు. “కమీషన్ లేకుండా సంక్షేమం అందిస్తున్నది ప్రజా ప్రభుత్వం” అని వ్యాఖ్యానించారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం జరుపుకోవాలి


**– డిసిపి సునీత రెడ్డి**




**యాచారం సెప్టెంబర్ 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

వినాయక ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని మహేశ్వరం డిసిపి సునీత రెడ్డి కోరారు. గురువారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని అమ్మోరు తోట కాలనీ వినాయకుని మండపన్నీ సందర్శించిన డిసిపి సునీత రెడ్డి ,ఏసిపి కేవీపీ రాజు యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి తో కలిసి సందర్శించారు ఈ సందర్భంగా డిసిపి సునీత రెడ్డి మాట్లాడుతూ... వినాయక విగ్రహాలు తరలింపలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విద్వేషాలకు వివాదాలకు తావివ్వకుండా పండుగను నిర్వహించుకోవాలని ముందు తరాలకు ఆదర్శంగా ఉండేలా నిర్వహకులకు కోరారు. ఈ కార్యక్రమంలో యాచారం ఎస్సై మధు , సత్యనారాయణ ,అమ్మోరు తోట కాలని వాసులు భక్తులు తుదితరులు పాల్గొన్నారు.

## దివ్య బాల విద్యాలయంలో గురుపూజోత్సవ వేడుకలు



**యాదాద్రి సెప్టెంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**

భువనగిరి మండలంలోని అనాజిపురం శివారులో గల స్థానిక దివ్య బాల విద్యాలయం ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన, గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాఠశాల ఫౌండర్ ఫాదర్ కాటరాజులు హాజరైన నేటి విద్యార్థులు రేపటి సమాజానికి ఉత్తమమైన పౌరులుగా క్రమశిక్షణ అవసరమని చెప్పారు. కరస్పాండెంట్ చిన్నప్ప మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు తరగతి గదిలోని టీచర్లపై ఆధారపడుతుందని అన్నారు. ప్రిన్సిపల్ సౌజన్య మాట్లాడుతూ స్వపరిపాలన దినోత్సవం లో పాల్గొనడం వల్ల విద్యార్థులకు ఉపాధ్యాయులలో ఉపాధ్యాయ వృత్తి ఎన్నో సవాళ్లతో కూడినదనే విషయం తెలుస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ గా హాజరైన వందనా భాయ్ డి ఈ ఓ గా, తనుశ్రీ ఎంఈఓ గా, దీపక్ రెడ్డి ఫాదర్గా, ఆంటోనీ కరస్పాండెంట్ గా, వసంత్ ప్రిన్సిపల్ గా, అశ్విత ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన చేసినట్లు తెలిపారు.

## అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కరీంనగర్‌లోని అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయ వృత్తి సమాజ నిర్మాణానికి పునాది అని పేర్కొన్నారు. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించారు. "ఉపాధ్యాయులు విద్యార్థుల లక్ష్య సాధనకు మార్గదర్శకులు. వారి బోధనతోనే ఉత్తమ సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది" అని ఆయన అన్నారు. వేడుకల్లో ఉపాధ్యాయులు ప్రదర్శించిన "ఉపాధ్యాయుడ జీవితానికి మార్గదర్శకుడా" నాటిక ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి, ఏటి కాలువను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**యాదాద్రి సెప్టెంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని సర్వే నెంబరు 259 లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పొలం చేసుకుంటున్నా వారి పైన, అనాజిపురం గ్రామంలోని ఏటి కాలువను ఆక్రమించుకున్న వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో అక్రమాన్నికి గురైన ప్రభుత్వ భూమిని, అనాజిపురం గ్రామంలోని ఏటి కాలువను పరిశీలన చేసిన అనంతరం భువనగిరి మండల తహశీల్దార్ అంజిరెడ్డి కి ప్రభుత్వ భూమిని, ఏటి కాలువను పరిరక్షించాలని, అక్రమ దారుల పైన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ముత్తిరెడ్డిగూడెం గ్రామంలోని సర్వే నెంబరు 259 లోని ప్రభుత్వ భూమి గ్రామంలోని రైతులకు, వృత్తిదారులకు పశు వుల, గొర్ల, మేకల మేతకు ఇతర అవసరాలకు ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామంలోని మబ్బురాల గుట్ట దగ్గర ప్రభుత్వ భూమిని ఆనుకొని ఉన్న పట్టా భూమిని ఒకతను కొనుగోలు చేసి ఆ భూమితో పాటు ప్రభుత్వ భూమిని కూడా తవ్వి పొలాలను అచ్చు కడుతున్నాడని, హద్దురాలను కూడా తొలగించారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వము వెంటనే స్పందించి ప్రభుత్వ భూమికి హద్దురాళ్ళు నిర్ణయించి, అక్రమ దారులపై చర్య తీసుకుని ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు. అనాజిపురం గ్రామంలో మొద్దుంపల్లి పాతకత్వ నుండి అనాజిపురం భోజకుంట, నందనము చెరువులోకి నీళ్లు రావడానికి ఉన్న ఏటి కాలువను కొంతమంది ఆక్రమించుకొని కాలువని పూడ్చినారని అన్నారు. మరోవైపు నక్ష బాటలో కాలువ తూము నుండి రైతు పంట పొలాలకు నీళ్లు దగ్గర బోరు వేసి రైతులు తమ పొలాలకు పోకుండా ఇబ్బందుల పాలు చేస్తున్న పరిస్థితి ఉన్నదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ఆ కాలువను పరిశీలన చేసి ఆక్రమ దారుల నుంచి కాల్వ భూమిని తీసుకొని కాలువను వెడల్పు చేసి కాలువ ద్వారా సాగు నీళ్లను అందించాలని, అక్రమంగా వేసిన బోరును పూడ్చాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని నర్సింహ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, కొండ అశోక్, మండల నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, అనాజిపురం శాఖ కార్యదర్శి అబ్దుల్లాపురం వెంకటేష్, ముత్తిరెడ్డిగూడెం శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ ,రెండు గ్రామాలకు సంబంధించిన సీపీఐ(ఎం) నాయకులు, రైతులు కదారి కృష్ణ , ఎండి జహంగీర్, ఏదునూరి చంద్రయ్య, నీలం బిక్షపతి, గంగదారి వెంకటేష్, కొండ మహేష్, మెరుగు స్వామి, ఎలగల రాజయ్య లు పాల్గొన్నారు.



## పేదల పక్షపాతిగా ప్రజల గుండెల్లో సురవరం సుధాకర్ రెడ్డి చెరగని ముద్ర



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కరీంనగర్ ఫిల్మ్ భవన్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ ఘనంగా జరిగింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, బిఆర్ఎస్ నేత నారదాసు లక్ష్మణ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వుట్కూరి నరేందర్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర నేతలు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.సురవరం విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో రాటుదేలిన కమ్యూనిస్టు యోధుడు. న్యాయవాద వృత్తిని వదిలి ప్రజల కోసం పోరాట బాట పట్టారు. విద్యుత్ చార్జీల పెంపు, కరువు, తెలంగాణ ఉద్యమం, పార్లమెంటులో 2జీ స్కాం లాంటి అంశాలపై గళమెత్తిన నేతగా గుర్తింపు పొందారు. పేదల కోసం అంబలి కేంద్రాలు, సాగునీటి పోరాటాలు, వామపక్ష ఐక్యత కోసం చేసిన కృషి ఆయన ప్రజానాయకత్వానికి నిదర్శనం.సురవరం ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని నేతలు పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి విప్లవ గేయాలు సభలో భావోద్వేగాన్ని నింపాయి. కమ్యూనిస్టు ఉద్యమానికి ఆయన చేసిన సేవలు నేటితరానికి మార్గదర్శకంగా నిలవాలని నేతలు పేర్కొన్నారు.

## పెద్దపల్లిలో సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ




**పెద్దపల్లి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా రంగు శ్రీను, తాళ్లపెల్లి లక్ష్మణ్, జూపాక రాంచందర్, తొడుపునూరి రమేశ్ కుమార్, ఎం.ఎ.గౌస్ తదితరులు పాల్గొని సురవరం సేవలను స్మరించుకున్నారు.

## పెద్దపల్లి ఎంపీ చొరవతో రైల్వే సడలింపులు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ విజ్ఞప్తి మేరకు ఇండియన్ రైల్వేలు పలు సూపర్‌ఫాస్ట్ రైళ్లకు రామగుండం, బెల్లంపల్లి, పెద్దపల్లి స్టేషన్లలో ఆగింపులను మంజూరు చేశాయి. ఈ నిర్ణయం ద్వారా ప్రయాణికులకు మెరుగైన అనుసంధానం, సౌకర్యవంతమైన రవాణా లభించనుంది. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఎంపీ వంశీ కృష్ణ ప్రజల అవసరాలపై చూపిన చొరవకు ఇది నిదర్శనం.

## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**– ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



**యాదాద్రి సెప్టెంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**

భువనగిరి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన రాసాల కొమురయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని బోనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రభుత్వ సహాయ నిధి నుండి ఎల్ఓసి ద్వారా వారి వైద్యం కోసం రూ.3,50,000 (అక్షరాలామూడు లక్షల యాభై వేల రూపాయలను) అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. పేద ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదని, వారు కూడా మెరుగైన వైద్య సేవలు పొందాలని తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రిలో లాగా వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఎవరు కూడా ఇబ్బందులకు గురి కావద్దని అన్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిక్కుల వెంకటేశం, గ్రామ శాఖ అధ్యక్షులు మచ్చ పాండు, రాసాల నవీన్, రాసాల అలివేల పాల్గొన్నారు.

## బల్మూర్ వద్ద కారు ప్రమాదం

**–తృటిలో తప్పిన ప్రాణాపాయం**



**బల్మూర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

బల్మూర్ మండలంలోని గట్టు తుమ్మెన్ గేటు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చంపేటకు చెందిన వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ప్రయాణికులు తీవ్రంగా గాయపడగా, గాయపడినవారిలో కాంగ్రెస్ నాయకులు ఉన్నట్లు సమాచారం. స్థానికులు అప్రమత్తమై వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించారు.



కరీంనగర్లోని గణపతి నిమర్జనం ఏర్పాట్లను చింతకుంట కెనాల్ వద్ద పరిశీలించిన కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్

# వినాయక నగర్‌లో కుంకుమ పూజ, అన్నదానంతో భక్తి శ్రద్ధల ఉత్సవం



**చొప్పదండి, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చొప్పదండి పట్టణంలోని 4వ వార్డు పరిధిలో గణేష్ నవరాత్రుల 39వ సంవత్సరాన్ని పురస్కరించుకొని వినాయక నగర్ మండపంలో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఘనంగా సాగింది. పూజలో పాల్గొన్న మహిళలకు ప్లేట్లు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు చేపూరి హేమ – సత్యనారాయణ, బిజిలి అనితతో పాటు మండప నిర్వాహకులు మేరుగు ఓదెలు, ఆడెపు మహేందర్, ఇప్పనపెల్లి రాజేశం, గుర్రం ఆనంద్ రెడ్డి, అరుకాల లక్ష్మీనారాయణ, మామిడాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# దేశరాజుపల్లిలో కలెక్టర్ ఆకస్మిక సందర్శన





**రామడుగు, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రామడుగు మండలంలోని దేశరాజుపల్లి జడ్పీహెచ్ఎస్ మరియు అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులను పరిశీలించిన ఆమె, ఏడవ తరగతి విద్యార్థులతో మాథ్స్ పాఠం గురించి ప్రశ్నలు అడిగి, స్వయంగా బోధన చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలంటూ ఉపాధ్యాయురాలికి సూచనలు చేశారు. పాఠశాలలో ఖాళీగా ఉన్న గదిని అంగన్వాడీ కేంద్రంగా మార్చాలని, విద్యార్థులు యూనిఫామ్, షూ తప్పనిసరిగా ధరించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి ఉన్నారు.


**పల్లె దవాఖాన సేవలపై సమీక్ష**
అదే రోజు దేశరాజుపల్లి పల్లె దవాఖానను సందర్శించిన కలెక్టర్, వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులతో మాట్లాడి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్య మహిళ రిజిస్ట్రేషన్లను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి వ్యాధుల వివరాలు సేకరించి, ఉచిత మందులు ప్రతినెలా అందించాలంటూ ఆదేశించారు. ఈ సందర్శనలో జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం ఆఫీసర్ సనా పాల్గొన్నారు.

# పారమిత విద్యాసంస్థల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
: కరీంనగర్‌లోని పారమిత విద్యాసంస్థల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుల ప్రారంభంతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.'దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్ర వృత్తి ఉపాధ్యాయునిదే. మనం ఆదర్శంగా ఉండాలి" అని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను స్వయంగా పోషిస్తూ, వారి అనుభవాలను పంచుకున్నారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కమ్మేసిన చెట్ల కొమ్మలతో అవస్థలు





**మోటకొండూరు సెప్టెంబర్ 04 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
పచ్చని చెట్లు ..ప్రగతికి మెట్లు అని అడుగడుగునా మొక్కలు నాటారు. ఆ మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. చెట్ల కొమ్మలు రోడ్డును ఆక్రమించినందున భారీ వాహనాల ప్రయాణానికి అడ్డుగా మారాయి. మోటకొండూరు మండలం లోని వర్టూరు గ్రామంలో మోటకొండూరు నుండి వర్టూర్ వెళ్ళే రోడ్డులో చెట్ల కొమ్మలు వాహనాలకు తగులుతున్నాయి. బస్సులోని ప్రయాణికులకు తగిలి ఇబ్బంది పెడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

# గణనాథునికి ఘనంగా కుంకుమ పూజ



**మంథని, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్**
మంథని మండలంలోని కమాన్ పూర్ కేంద్ర గోకుల్ నగర్ కురుమ సంఘం భవనంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణనాథునికి మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని గణనాథుడిని పూజించి ఆధ్యాత్మికతను చాటారు.

# గురువులకు ఘన సన్మానం

## గణనాథునికి ప్రత్యేక పూజలు



**మహాదేవపూర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మహాదేవపూర్ మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో గురుపూజోత్సవం సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ముఖ్య అతిథిగా హాజరై, "గురువులు సమాజ నిర్మాణ శిల్పులు. వారి సేవలకు కృతజ్ఞతగా సన్మానం చేయడం గౌరవంగా భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. అదే రోజు ముత్తారం మండలంలోని రైజింగ్ యూత్, టవర్స్ కాలనీ, లంబడి వాడలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలను సందర్శించిన శ్రీను బాబు, విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. "విఘ్నేశ్వరుని ఆశీర్వాదంతో ప్రజలకు సుఖశాంతులు, రాష్ట్రానికి అభివృద్ధి కలగాలి" అని ఆకాంక్షించారు.

# ఎస్‌టిఓ దేవేందర్‌కు ఘన సన్మానం

## పదోన్నతితో గౌరవవంతమైన పదవీ విరమణ



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ దేవేందర్ పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన సన్మాన మహోత్సవం హృద్యంగా సాగింది. 39 సంవత్సరాల సేవా ప్రయాణాన్ని ముగించుకున్న దేవేందర్, అదే రోజున అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ పదోన్నతి పొందడం విశేషంగా నిలిచింది. ఇది ఆయన అంకితభావం, నిజాయితీకి ప్రభుత్వం ఇచ్చిన గౌరవ పట్టమని ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. "హోదాలు శాశ్వతం కాకపోయినా, సేవలు మాత్రం చిరస్మరణీయంగా నిలుస్తాయి. దేవేందర్ అన్న గారు సహోద్యోగుల హృదయాలను గెలుచుకున్నారు" అని ఆయన అన్నారు. ట్రెజరీ శాఖలో పని చేయడం అదృష్టమని, జీతాల ద్వారా జీవితాలను కాపాడే బాధ్యతను నిర్వర్తించడం గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా తెలంగాణ ఎన్జీవోలు, గెజిటెడ్ అధికారుల సంఘం, ఎంప్లాయిస్ జేఏసీ తరఫున దేవేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, బొంకూరు శంకర్, సంగం లక్ష్మణరావు, డాక్టర్ అరవింద్ రెడ్డి, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, హర్మేందర్ సింగ్, కోట రామస్వామి, మారుపాక రాజేష్, కొండయ్య, సందీప్ రెడ్డి, పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, లింగయ్య, రోహిత్, ఆజ్గర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



**అచ్చంపేట, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బల్మూర్ మండలంలోని గట్టు తుమ్మెన్ స్టేజ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అచ్చంపేట కాంగ్రెస్ కౌన్సిలర్లు గౌరీ శంకర్, ఆకుల వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు రఘురాం లను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరామర్శించారు.ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే నాగర్ కర్నూల్ గాయత్రి హాస్పిటల్‌కు చేరుకున్న ఎమ్మెల్యే, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి ఎండీకి ఆదేశాలు జారీ చేసి, సీనియర్ వైద్యులకు ప్రత్యేక సూచనలు చేశారు.

# కొత్తపల్లి ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్ మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ సనా జవేరియా గురువారం ఆకస్మికంగా సందర్శించారు. హాజరు పట్టిక, అవుట్ పేషెంట్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను పరిశీలించి కేంద్ర పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఎన్‌సీడీ క్లినిక్‌లో అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలను పరిశీలించి, వారికి ఉచిత మందుల సరఫరా విధానాన్ని గమనించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మందులను వినియోగించేందుకు ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. ఫార్మసీ స్టోర్లలో సీజనల్ వ్యాధుల మందుల నిల్వలను, ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపుల స్క్రీనింగ్ వివరాలను పరిశీలించారు. ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్ పరిశుభ్రతను పరిశీలించి, సాధారణ డెలివరీల కోసం గర్భవతులను ప్రోత్సహించాలన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నజీమా సుల్తానా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


# దళితుల ఆత్మగౌరవాన్ని అవహేళన చేస్తే ఊరుకోం

## కరీంనగర్‌లో భారీ నిరసన



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కరీంనగర్‌లో వెలిచాల రాజేందర్ రావు తీరుపై దళిత, బీసీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. పిసిసి, డిసిసి అధ్యక్షుల ఫోటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం క్రమశిక్షణ ఉల్లంఘనగా అభివర్ణిస్తూ, దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించే చర్యలపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, వారి పట్ల అవమానకరంగా వ్యవహరించిన రాజేందర్ రావును పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. "కేవలం దళితుడైనందుకే డిసిసి అధ్యక్షుడి ఫోటోను తొలగించడం దళితులపై అవహేళన" అని ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కాదాసి ప్రభాకర్, విద్యార్థి నాయకుడు మాతంగి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజేందర్ రావు కార్యాలయం నుంచే ఫ్లెక్సీలు వెలువడినట్లు తమ వద్ద పూర్తి సమాచారం ఉందని, సమాధానం ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. "వేలాది దళితులతో కార్యాలయాన్ని ముట్టడిస్తాం" అని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ దళిత, బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుంటే, కరీంనగర్‌లో మాత్రం ఫ్యూడల్ రాజకీయాలు నెరపాలని రాజేందర్ రావు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఆయనను సస్పెండ్ చేయాలని జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ విజయ జెండా ఎగరేస్తాం: బైరెడ్డి రమణారెడ్డి



**ఇల్లందకుంట, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
హుజురాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంట మండల రాచపల్లి గ్రామంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సన్నాక సమావేశం బీజేపీ నేతల ఉత్సాహభరిత హాజరుతో జరిగింది. మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, BJP OBC మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్ మాట్లాడుతూ, "ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు. ఈసారి అన్ని స్థానాల్లో గెలుపు ఖాయమని విశ్వాసం ఉంది" అని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాల నేపథ్యంలో బీజేపీకి మంచి అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉప్పుల రమేష్, గుత్తికొండ రాంబాబు, అబ్బిడి తిరుపతి రెడ్డి, ఎనగంటి మహేందర్, రావుల విజయ్ బాబు, తాళ్ల పాపిరెడ్డి, మట్ట పవన్ రెడ్డి, మద్దూరి మల్లేష్, బండ రాజకుమార్, రాజ అంకుశవాలి, మొత్కూరి మహేష్, నరేందర్ రెడ్డి, అరవింద్, చంద్రయ్య, రమేష్, రాములు, వెంకటేష్, నాగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ నగర్‌లో గణనాథుని పూజ

-నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మంగళవారం హనుమాన్ నగర్‌లోని పలు వినాయక మండపాలను సందర్శించి గణనాథునికి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.అదే రోజు గోదావరి బ్రిడ్జి వద్ద రేపు జరగనున్న వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా సాగేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, ఏసీపీ మడత రమేష్, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా భారీగా హాజరయ్యారు.'నిమజ్జనానికి వచ్చిన భక్తులు క్రమశిక్షణ పాటించాలి. చిన్నారులు, మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలి. పచ్చబొమ్మల వినియోగాన్ని ప్రోత్సహించాలి. పోలీస్, మున్సిపల్ సూచనలు పాటించాలి" అని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ విజ్ఞప్తి చేశారు.గోదావరి తీరం మరోసారి భక్తిశ్రద్ధలతో నిండిపోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో గణనాథునికి పూజ, అన్నదానం నిర్వహించిన కమిషనర్ గౌష్ ఆలం



**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ స్వయంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. "వినాయకుడి ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా, సురక్షితంగా ఉండాలి" అని ఆకాంక్షించారు.పూజ అనంతరం కమిషనరేట్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హోంగార్డులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "పండుగలు మనందరినీ ఏకం చేస్తాయి. ఇలాంటి కార్యక్రమాలు స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుతాయి" అని కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు వెంకటరమణ, భీం రావు, పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## గణేశ్ మండపాల్లో ప్రత్యేక పూజలు చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని పలు గణేశ్ మండపాలను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో నర్మద మల్లికార్జున, ప్రతీక్, గిరివర్ధన్ రెడ్డి, ఆర్‌కే శ్రీనివాస్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే చింతల్ డివిజన్, పద్మనగర్ మండపాల్లో గణనాథుని దర్శించి పూజలు చేసిన ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు గిరివర్ధన్ రెడ్డి, కట్ట కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండపాల వద్ద భక్తుల ఉత్సాహం, పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి.

## నవరాత్రి ఉత్సవాల్లో నాయిని దంపతుల ప్రత్యేక పూజలు



**వరంగల్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

పశ్చిమ వరంగల్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్న నేపథ్యంలో, శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమ పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. "ప్రజలందరూ గణపతి బప్పా ఆశీస్సులతో ఆనందంగా, ఆరోగ్యంగా, అభివృద్ధితో జీవించాలి" అంటూ ఎమ్మెల్యే దంపతులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్ల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండపాల వద్ద భక్తి శ్రద్ధలతో కూడిన వాతావరణం నెలకొంది.

# కొత్తపల్లి-హుస్నాబాద్ రహదారి పనులపై సమీక్ష




**హుస్నాబాద్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

హుస్నాబాద్ నియోజకవర్గంలో కొత్తపల్లి -హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇప్పటికే రహదారి మార్కింగ్ పూర్తయిన నేపథ్యంలో విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్త లైన్ ఏర్పాటు, చెట్ల తొలగింపు, బావుల పూడ్చివేత వంటి పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. గ్రామాల గుండా వెడల్పు చేస్తున్న రహదారి నిర్మాణానికి సంబంధించి గ్రామసభలు ఏర్పాటు చేసి తీర్మానాలు తీసుకోవాలని సూచించారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి తదితర గ్రామాల్లో రహదారికి ఆనుకొని ఉన్న బావులను పూడ్చివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి బాలామణి, ఆర్ అండ్ బి ఈఈ నరసింహచారి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా




**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినులు స్వయంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భయాన్ని పోగొట్టి, నమ్మకాన్ని నింపే వారని, తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులేనని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా. అఫ్సరీ ఉస్మాని, ఇతర అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. మలబారు గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ తరఫున కేక్ కట్ చేయించి ప్రిన్సిపల్‌ను సత్కరించారు.

## కరీంనగర్‌లో వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన బందోబస్తు




**కరీంనగర్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ మళ్లింపు, విద్యుత్ జాగ్రత్తలు, రూట్ మ్యాపింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కీలక ప్రాంతాల్లో స్టాటిక్ బందోబస్తుతో పాటు, ప్రజల సహకారంతో నిమజ్జనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## జమ్మికుంటలో రైళ్ల నిలుపుదలపై బీజేపీ శ్రేణుల సంబరాలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

దక్షిణ్, రాయపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల జమ్మికుంట స్టేషన్‌లో నిలుపుదలపై బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బండి సంజయ్ చొరవతో రైల్వే శాఖ నిర్ణయం తీసుకుందని, ప్రయాణికుల సౌకర్యార్థం ఇది మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న వ్యాఖ్యలపై తీవ్ర నిరసన



**హుస్నాబాద్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

హుస్నాబాద్ నియోజకవర్గంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన గిరిజన నాయకులు, వారిపై రాజద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ నేత గుగులోతు తిరుపతి నాయక్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేశారు. వెంకట్రావు సుప్రీంకోర్టులో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న పిటిషన్ వెనుక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర ఉందని ఆరోపించారు. "లంబాడి, కోయ జాతుల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలనే కుట్ర ఇది" అని గిరిజన సంఘాల నాయకులు మండిపడ్డారు. 1976లో కేంద్ర ప్రభుత్వం బంజారాలను ఎస్టీగా గుర్తించి చారిత్రక హక్కుగా జాబితాలో చేర్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల మధ్య విభేదాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "లంబాడీలు చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనది. బీజేపీ బంజారా, గిరిజన జాతుల పక్షాన నిలుస్తుంది. చేపట్టే ఆందోళనలకు సంపూర్ణ సహకారం అందిస్తాం" అని హామీ ఇచ్చారు.వినతిపత్రం అందజేసిన వారిలో భూక్య తిరుపతి నాయక్, గుగులోతు రాజు నాయక్, రవీందర్ నాయక్, సదానందం నాయక్, లక్పతి నాయక్, రాజన్న నాయక్, రాజ్ కుమార్ నాయక్, ముఖ్య రమేష్ నాయక్, లకావత్ రవీందర్ నాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

-: డి.టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి





**హుస్నాబాద్/అక్కన్నపేట , సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

: హుస్నాబాద్ & అక్కన్నపేట మండలాల్లో డి.టిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా జి.ప.ఉ.పాఠశాలలు (బాలురు & బాలికలు) సందర్శించిన డి.టిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి, ప్రభుత్వాన్ని పలు కీలక అంశాలపై డిమాండ్ చేశారు. "ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు, తరగతికి ఒక ఉపాధ్యాయుడు, పెండింగ్ బిల్లుల చెల్లింపులు, డిఇఓ-యంఇఓ పోస్టుల భర్తీ, విద్యారంగానికి అధిక బడ్జెట్ కేటాయింపు అవసరం" అని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, "జిపిఎఫ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. డిప్యుటేషన్ ప్రక్రియను పాఠశాలల వారిగా లిస్టు రూపంలో ప్రకటించాలి" అని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో హుస్నాబాద్ ప్రదానోపాధ్యాయులు కె. వాసుదేవ్ రెడ్డి, డి.టిఎఫ్ పూర్వ అధ్యక్షులు కె. నారాయణరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వి. వెంకట రమణా రెడ్డి, మండల అధ్యక్షులు డి. సంపత్ రెడ్డి, ఈర్య, బి. ప్రభాకర్ రెడ్డి, మల్లయ్య, గోవర్ధన్ రెడ్డి, సతీష్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం డి.టిఎఫ్ చేస్తున్న కృషికి ఈ సమావేశం నిదర్శనంగా నిలిచింది.

## హుస్నాబాద్‌లో యూరియా కోసం రైతుల ఆందోళన

రాస్తారోకో, ఉద్రిక్తత



**హుస్నాబాద్, సెప్టెంబర్ 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)**

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద యూరియా కొరతపై రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. హనుమకొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. యూరియా అందక ఇబ్బందులు పడుతున్న రైతులు మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడి చేయగా, పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే పెద్ద ఎత్తున బైటాయించి నిరసన కొనసాగించారు. "చిట్టీలు ఇస్తేనే కదులుతాం" అంటూ రైతులు స్పష్టం చేశారు. రైతులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. యూరియా సరఫరా సమస్యపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.